

బెంగుళూర్ వెళ్ళే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ అరగంట ఆలస్యంగా నడుస్తోందన్న ఎనౌన్స్‌మెంట్ విని రైల్వే ప్లాట్‌ఫారం లోని సిమెంట్ బెంచీవైపు నడిచాను. నేను కూర్చోవచ్చన్నట్లుగా పక్కకి జరిగాడు అంతకుముందే దానిమీద కూర్చునివున్న ఓ ఏభై ఏళ్ళ ముసలాయన.

"మీరూ బెంగుళూర్ వెళ్తున్నారా?" అడిగాడు.

"కర్నూలుదాకా" చెప్పాను.

తన చేతికున్న గడియారం తీసి అందించాడు నాకు. "దీని ఖరీదు ఎంతుండవచ్చు?" అడిగాడు.

తేదీ, వారం చూపించే అది ఆటో

మేటిక్ కాబట్టి 'అయిదువంద లుండ వచ్చు' అన్నాను.

"ఎంతకి కొంటారు ?" అడిగాడు కాసేపాగి.

"అమ్ముతున్నారా ?" అడిగాను.

అవునన్నట్లుగా తలవూపి చెప్పాడు.

"నాకిది ప్రజెంట్ చేసారు స్నేహితులు. నాకు వేరే వుంది."

చాలాకాలంనుంచి చేతిగడియారం కొనాలనే వుద్దేశంలో వున్నాను కాబట్టి అడిగాను.

"ఎంతకమ్ముతారు ?"

"నాలుగు వందల యాభై."

"వద్దులెండి."

"ఎంతో కొంత ధర చెప్పండి" అన్నాడు నవ్వుతూ.

"రెండువందల యాభై."

"మరీ తక్కువ చెప్తున్నారు. కొత్త వాచీ ఇది. రెండు చేతిగడియారాలు అవసరం వుండవు కాబట్టి అమ్ముతున్నాను."

"వద్దు లెండి."

"నాలుగు వందల పాతిక ?"

"నా దగ్గర అంత లేదు."

చాలాసేపు, దాదాపు ఇరవై నిముషాలు నేను వద్దన్నా బేరం ఆడి చివరికి రెండు వందల యాభై కి దిగాడు. ఆ ధరకి అది చవకే. నిజానికి అంత చవకగా అమ్ముతాడనుకోలేదు.

నేను పర్స్ జేబులోంచి తీస్తుండగా ప్లాట్ ఫారంమీదకి వచ్చింది రైలు.

ఆయన వెంటనే చేతిగడియారం పెట్టుకుని లేచి పెట్టెని అందుకున్నాడు హడావిడిగా.

"అమ్మరా ?" అడిగాను కొద్దిగా తెల్లబోతూ.

"సారీ ఫ్రండ్. నే చెప్పిందంతా అబద్ధం. అరగంట వూరికే కూర్చుంటే విసుగుపుడుతుందని చిన్న తమాషా చేసానంతే."

నేను ఆశ్చర్యంలోంచి తేరుకొనే లోపలే ఆయన జనంలో కలిసిపోయాడు.

